మళ్లీ రేషన్ కష్టాలు!

- ఇంటింటా రేషన్ పంపిణీకి కూటమి సర్కార్ స్వస్తి
- డిపోల వద్ద సరుకుల పంపిణీతో లబ్ధిదారుల అవస్థలు
- తొలిరోజే ఇబ్బందులు పడిన ప్రజలు
- చాలాచోట్ల సర్వర్ డౌన్..

టెక్కలి నియోజకవర్గంలో రేషన్ లబ్ధిదారులు ..

మండలం	డిపోలు	కార్డులు	యూనిట్లు
టెక్కలి	50	21,765	63,662
కోటబొమ్మాళి	53	22,811	65,339
సంతబొమ్మాళి	47	22,859	66,247
నందిగాం	48	18,222	52,071


టెక్కలిలో ఆదివారం రేషన్ డిపో వద్ద సరుకులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

టెక్కలి:

ప్రజలకు రేషన్ కష్టాలు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన ఇంటింటా రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. పేద, సామాన్యవర్గాలకు చెందిన లబ్ధిదారులంతా పడిగాపులు కాయాల్సిందేనంటూ రేషన్ డిపోల నుంచి సరుకుల పంపిణీని ఆదివారం నుంచి ఆరంభించారు. దీంతో నిత్యావసర సరుకుల కోసం లబ్ధిదారులు డిపోలకు క్యూకట్టారు. భగభగమండిపోయిన ఎండలో అల్లాడిపోయారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వాహనం ద్వారా సరుకులు ఇచ్చేవారని.. దీంతో ఇబ్బందులు ఉండేవికాదని జ్ఞాపకం చేసుకుంటున్నారు. కూలి పనులు చేసుకునే వారంతా డిపోల చుట్టూ తిరగాల్సిందేనా అని ప్రశ్నిస్తున్నారు. కూటమి నాయకులు వచ్చి రేషన్ పంపిణీని ప్రారంభించేవరకూ తొలిరోజున లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకుంది.




టెక్కలిలో రేషన్ వాహనాల ద్వారా సరుకులు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఇక నిరీక్షణే..


పలాస: మామిడిపల్లిలో రేషన్‌డిపో వద్ద వేచి ఉన్న మహిళలు

సోంపేట: రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులు సరుకుల కోసం ఆదివారం నిరీక్షించారు. కూటమి నాయకులు అట్టహాసంగా ప్రారంభించినా ఉదయం సగం దుకాణాల్లో సర్వర్ సమస్యతో సరుకుల పంపిణీ జరగలేదుర. సాయంత్రానికి మొత్తం 57 రేషన్ దుకాణాల్లో 55 డిపోల వద్ద సరుకులు సరఫరా ప్రారంభవ్వగా.. శారదాపురం, ఎకువూరు డిపోల్లో అసలు సరుకులు పంపిణీ చేయలేదు. ఇకనుంచి ఈ తిప్పలు తప్పవని రేషన్ వినియోగదారులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇంటి వద్దకే సరుకులు వచ్చేవి..



గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వచ్చి రేషన్ సరుకులు అందజేసేవారు. అప్పుడు ఎటువంటి ఇబ్బంది లేదు. పనులు కూడా హాయిగా చేసుకునేవాళ్లం. ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ రేషన్ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం సరుకులు ఇస్తామని చెప్పడంతో డిపో వద్దకు వెళ్లాను. అయితే సర్వర్ పని చేయడం లేదని చెప్పి పంపించేశారు. సాయంత్రం వెళ్తే చాలా మంది క్యూలో ఉన్నారు. గంటల కొద్ది బియ్యం కోసం నిలబడి ఉండాల్సి వస్తుంది. ఇళ్ల వద్దకే సరుకులు వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలి.

– మురిపింటి నారాయణమ్మ, గృహిణి, మామిడిపల్లి, పలాస మండలం

తొలిరోజే ప'రేషన్'!


ఇచ్ఛాపురం రూరల్: తెరుచుకోని మండపల్లి రేషన్ డిపో


ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురంలో సరుకులు దించుతున్న కలాసీలు

ఇచ్ఛాపురం రూరల్: ఇంటి ముంగిటకే నిత్యావసర సరుకులు అందించే వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దుచేసి చౌకధరల దుకాణాల వద్ద రేషన్ అందించడంలో తొలిరోజే అబాసు పాలయింది. గిడ్డంగి నుంచి సరుకులు రేషన్ దుకాణాలకు రాకపోవడంతో మండలంలోని బాలకృష్ణాపురం, మండపల్లి, మశాఖపురం, కొలిగాం, కీర్తిపురం, పాయితారి రేషన్ డిపోలు తెరుచుకోలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. మధ్యాహ్నం సరుకులు రావడంతో పంపిణీ ప్రారంభించినప్పటికీ సర్వర్ డౌన్ కావడంతో కార్డుదారులు పడిగాపులు కాచారు.

పని చేయని సర్వర్..


ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని రేషన్ డిపో వద్ద వేచిఉన్న లబ్ధిదారులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని 15 డిపోల వద్ద లబ్ధిదారులు సరుకుల కోసం పడిగాపులు కాశారు. కూటమి నాయకులు వచ్చే వరకు పంపిణీ ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి పిపోల వద్ద వేచి ఉన్నప్పటికీ సర్వర్ సక్రమంగా పని చేయక పోవడంతో కేవలం నాలుగైదు కార్డుదారులకే సరుకులు అందాయి. సాయంత్రం కూడా ఇదేపరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు.

ఇళ్ల వద్దకే సరుకులు పంపిణీ చేయాలి



ఇళ్ల వద్దకే తీసుకొచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి. గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలతో ఇళ్ల వద్దకు తెచ్చి సక్రమంగా సరుకులు పంపిణీ చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదివారం నుంచి రేషన్ డిపోల వద్దకు వెళ్లి సరకులు తీసుకెళ్లమని ఉత్తర్వులు ఇచ్చారు. దీని వలన మళ్లీ రేషన్ కష్టాలు మొదలవుతాయి.

–మెండ మురళీనాయుడు, కేసరపడ గ్రామం, కంచిలి మండలం

పడిగాపులు..



మందసలోని రేషన్ డిపో వద్ద లబ్ధిదారుల పడిగాపులు

మందస: మందస మండలంలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 65 డిపోలు ఉండగా.. 20 వేల మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారు. తొలిరోజు సరుకుల పంపిణీ నామమాత్రంగానే జరిగింది.

ఎండతో ఇబ్బందిపడ్డాం..



డిపోల వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. ఆదివారం తీవ్రమైన ఎండతో పడరానిపాట్లు పడ్డాం. వృద్ధులకు ఇంటి వద్దే సరుకులు ఇస్తారని చెప్పినా ఆ పరిస్థితి లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే సరుకులు సరఫరా చేయడంతో ఇబ్బందులు ఉండేవి కావు.

–కుసిరెడ్డి వాసు, మందస

క్లుప్తంగా

సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేపట్టాలి


బలియాపుట్టుగ డిపో వద్ద రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కంచిలి: డిపోల వద్దనే ఇక నుంచి రేషన్ సరకులు డీలర్లే నేరుగా పంపిణీ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సక్రమంగా సరకులు పంపిణీ చేపట్టాలని డీలర్లకు స్థానిక తహశీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బలియాపుట్టుగ రేషన్ డిపో వద్ద నుంచి సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ చేతులమీదుగా ఆదివారం చేపట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్దేశిత సమయాల్లో తప్పనిసరిగా డిపోలు తెరచి పంపిణీ చేయాలని, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ డి.సంతోష్, ఆర్ఐ క్రిష్ణప్రసాద్ రాళో, వీఆర్వో చూడామణి రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు కొత్తకోట నాగరాజు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 8 మంది ఉపాధ్యాయులు


నూతన హెచ్‌ఎంను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: బదిలీలపై కేటాయించిన పాఠశాలలకు వచ్చిన ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఆదివారం విధుల్లో చేరారని ఎంఈవో కె.అప్పారావు తెలిపారు. అలాగే ఇచ్ఛాపురంలో విధులు నిర్వహించే 20 మంది ఉపాధ్యాయులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లారన్నారు. వారి స్థానంలో కేటాయించిన వారు రావాల్సి ఉందని చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా విధుల్లో చేరిన కె.సూర్యను పాఠశాల కమిటీ సభ్యులు ఆశి లత, గౌరీశంకర్, శ్రీధర్ రెడ్డిలు అభినందించారు. అలాగే బదిలీపై వెళ్లిన ఎస్.విశ్వనాథాన్ని సత్కరించారు.

మినీ ట్రాన్స్‌పోర్టు సంఘ నూతన కార్యవర్గం


శ్రీకాంత్ సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకాటమ్మతల్లి మినీట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికై ంది. గౌరవ అధ్యక్షులుగా దువ్వాడ శ్రీకాంత్, అధ్యక్షులుగా జనా మోహన్, ఉపాధ్యక్షులుగా అడపా మేఘనాథ్, కార్యదర్శిగా పిట్ట రాజేష్, క్యాషియర్‌గా సనపల అమ్ములను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్‌ను సభ్యులు సత్కరించారు.

విద్యుత్ వెలుగుల్లో కంచిలి..


హైవే కూడలి నుంచి వచ్చే మార్గంలో ఇస్రో రాకెట్ల నమూనాతో ప్రవేశద్వారం

కంచిలి: పదేళ్ల తర్వాత జరుగుతున్న కంచిలి గ్రామదేవత కంచమ్మతల్లి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కోల్‌కత్తా వారిచే సుమారు రెండు కిలోమీటర్లు ఉండే మెయిన్ రోడ్డు, వీధుల్లోను వివిధ రకాల బల్బులతోను, ఫ్రేమ్‌లతో లైటింగ్ ఏర్పాటు చేశారు. కంచిలికి రెండు వైపుల నుంచి ప్రవేశద్వారాలుగా క్లాత్‌తో భారీ స్వాగత గేట్లను ఏర్పాటు చేశారు. కంచమ్మతల్లి పీఠస్థానం, నమూనా విగ్రహాల వద్ద మరింత చక్కగా అలంకరణ చేశారు.

5 వాహనాలు స్వాధీనం

సోంపేట: సోంపేట పట్టణంలో ఎస్సై లోవరాజు ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సరైన పత్రాల్లేని ఐదు వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పైపులైన్ పనులు పూర్తి

టెక్కలి రూరల్: స్థానిక గోపినాథపురం సమీపంలో కొద్దిరోజులుగా పైపులైన్ల మరమ్మతుల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పది రోజుల అనంతరం మరమ్మతులు పూర్తయ్యాయి. దీంతో ఆదివారం నుంచి ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతుండడంతోపాటు.. ఈ రోడ్డు మీదగా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలిరావాలి


కోటబొమ్మాళిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగో తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ప్రతీఒక్కరూ తరలిరావాలని కోరుతూ ఆదివారం కోటబొమ్మాళిలో ఇంటింటా ప్రచారం చేశారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, పార్టీ మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు ఆధ్వర్యంలో పలు వీధుల్లో ప్రచారం చేసి కరపత్రాలు, పోస్టర్లను అందజేశారు. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ఎన్నికల మునుపు కూటమి నాయకులు హామీలిచ్చారని, అధికారం చేపట్టి ఏడాది గడచినప్పటికీ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కొత్తపేట సర్పంచ్ రామపాత్రుని సావిత్రమ్మ, పార్టీ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఎస్.జనార్దన్‌రెడ్డి, నాయకులు బొడ్డు అప్పన్న, శివారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం


పూజల్లో ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం బోర్డర్ అమీన్‌సాహెబ్ పేట వద్ద గల ఉమాసహిత చంద్రశేఖరస్వామి దేవాలయ జీర్ణోద్ధరణ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు పాల్గొని ఉమాసహితచంద్రశేఖరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారింగి మోహన్‌రావు, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

ఆరు నుంచి ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలలో ఈ నెల ఆరో తేదీ నుంచి ఆరో తరగతిలో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చిన్నాజి వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీసు బోర్డుపై అంటించడం జరిగిందన్నారు.

'వెన్నుపోటు దినం' ర్యాలీని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మందస: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం పేదప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా ఈ నెల నాలుగో తేదీన ఉదయం పది గంటలకు పలాసలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సూర్యారావు, జెడ్పీటీసీ సభ్యురాలు చంద్రమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు డిల్లీ జానకీరావు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ చింతాడ గణపతి, కర్రీ గోపాల్ కోరారు. ఈ మేరకు మందసలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పథకాన్ని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, కార్యకర్తలు, యువత, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'మహానాడు'తో మాయమాటలు

- ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి
- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంచిలి: 'మహానాడు'సాక్షిగా టీడీపీ రాష్ట్ర ప్రజలకు మాయమాటలుతో మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు ఆరోపించారు. కంచిలిలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నేతలతో కలిసి విలేకరులతో ఆదివారం సాయంత్రం మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అరాచకాలు చేస్తూ, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కాలం గడిపేసిందన్నారు. ఈ అంశాల్ని ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ తరఫున తీసుకెళ్లేందుకు ఈ నెల నాలుగో తేదీన ఇచ్ఛాపురం కేంద్రంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం'నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. నాలుగో తేదీన ఇచ్ఛాపురం టౌన్‌లో ఉదయం తొమ్మిది గంటలకు ర్యాలీగా వెళ్లి మెయిన్‌రోడ్డు, దాసన్నపేట జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి వెళ్లి తహసీల్దార్ ఆఫీసులో వినతిపత్రం అందజేస్తామన్నారు. ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఇప్పిలి కృష్ణారావు, నర్తు నరేంద్రయాదవ్, కడియాల ప్రకాశ్, కంచిలి మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఇచ్ఛాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు బలివాడ ప్రకాశరావు పట్నాయక్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, పిలక సంతోష్, దుర్గాసి ధర్మారావు, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, మడ్డు వెంకటరావు, రాంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన కూటమి సర్కార్

- వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణదాస్, అప్పలరాజు, రవిబాబు


పోస్టర్ ఆవిష్కరణలో కృష్ణదాస్, అప్పలరాజు, రవిబాబు తదితరులు

కాశీబుగ్గ: అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఏడాది కాలం పూర్తికావస్తున్న ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం చూస్తే రాష్ట్రంలో సంక్షేమం సంక్షోభంలో ఉందనే అనుమానం వ్యక్తమవుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా పార్లమెంటు పరిశీలకుడు కుంబా రవిబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల నాలుగో తేదీన నిర్వహించతలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం వాల్ పోస్టర్లను కాశీబుగ్గలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమలుకు నోచుకోని సూపర్ సిక్స్ హామీలతో కూటమి సర్కార్ ప్రజలను మోసం చేసి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజల తరఫున ప్రశ్నించేందుకు తమ పార్టీ సిద్ధమైందన్నారు. కాశీబుగ్గ వైఎస్సార్ స్క్వేర్ వద్ద నాలుగో తేదీ ఉదయం పది గంటలకు నియోజకవర్గ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కోరారు. నాయకులు హనుమంతు వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణీశ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు బత్తిన హేమేశ్వరరావు, బోర కృష్ణారావు, దువ్వాడ మధుకేశ్వరరావు, అగున్న సూర్యారావు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యధన, మున్సిపాలిటీ, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల అధ్యక్షులు సిస్టు గోపి, దువ్వాడ రవి, తిర్ర రాజారావు, దల్లీ జానకిరెడ్డి, మహిళా ప్రతినిధులు సుజాత పండా, బోర చంద్రకళ, ఉషారాణి, పలాస మందస వజ్రపుకొత్తూరు ఎంపీపీలు ఉంగ ప్రవీణసాయికృష్ణ, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


కవిటి: రాజపురం ఉన్నతపాఠశాలలో 1997-2002 పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

చదువుకున్న రోజులను వారంతా గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఒకరినొకరను ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. ఇంతటి ఆనందానికి చదువుకున్న పాఠశాలలే వేదికలయ్యాయి. వివిధ విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న పలు పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా చదువుకున్న పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. చదువు చెప్పిన గురువులను సత్కరించి గౌరవించారు.

–సాక్షి నెట్ వర్క్


కవిటి ఉన్నత పాఠశాలలో 1993-94 బ్యాచ్ విద్యార్థులు


కాశీబుగ్గ: కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు


వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు